సాక్షి నంద్యాల

శుక్రవారం ; 15 ; ఆగస్టు ; 2025



నీటి విడుదల తగ్గింపు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలను గురువారం 32 వేల నుంచి 22 వేల క్యూసెక్కులకు తగ్గించారు. IIలో▸



ఎరువుల దుకాణాలపై విజి'లెన్స్'

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. రైతుల రూపంలో వెళ్లి ధరలను పరిశీలించారు. IIలో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్ఫ్లో (క్యూసెక్కులు)	:21,885
ఔట్ఫ్లో (క్యూసెక్కులు)	:21,731

న్యూస్‌రీల్

వైద్యసేవలు విస్తృత పరచాలి

డోన్: కర్నూలు, నంద్యాల జిల్లాలోని తొమ్మిది మండలాల ప్రజలకు అందుబాటులో ఉన్న డోన్ వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలను మరింత విస్తృతపరచాలని వైద్యులను నంద్యాల జిల్లా ఆస్పత్రుల సమన్వయధికారి(డీసీహెచ్ఎస్) డాక్టర్ లలిత ఆదేశించారు. ఆసుపత్రిని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీచేసి ఇక్కడ అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. రోగులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎలాంటి ఫిర్యాదులు లేకుండా సరైన వైద్యసేవలు అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్‌కు సూచించారు.

జిల్లాలో మోస్తరు వర్షం

నంద్యాల(అర్బన్): జిల్లాలో బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు ఒక మోస్తరు వర్షం కురిసింది. కొత్తపల్లె మండలంలో అత్యధికంగా 40.6 మి.మీ వర్షం కురియగా చాగలమర్రి మండలంలో అత్యల్పంగా 2.2 మి.మీ వర్షం కురిసింది.

ప్రజాస్వామ్యం ఖూనీ



ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

నంద్యాల: పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌ను ఏ విధంగా పాలిస్తున్నారో ప్రజలందరికీ తెలుసన్నారు. ఒంటిమిట్ట, పులివెందులలో జరిగిన ఎన్నికల తీరు చూస్తే, ఆయన పాలన ప్రజలకు పూర్తిగా తెలిసిపోయిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ కూటమి ప్రభుత్వం ఎన్నికలను నిర్వహిస్తోందని, ఏజెంట్లను లేకుండా చేసి మోసపూరిత పద్ధతుల్లో గెలిచిందన్నారు. చివరికి పోలీసు అధికారులు సైతం కూటమి ప్రభుత్వానికి లొంగిపోయి, వారి ఆదేశాలను పాటిస్తున్నారని విమర్శించారు. ఎన్నికలలో రాక్షసత్వం, రౌడీయిజం చేసే టీడీపీని అధికారం నుంచి తొలగించే రోజు త్వరలోనే వస్తుందన్నారు.

వీబీఆర్‌లో 15 టీఎంసీల నీరు

వెలుగోడు: బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(వీబీఆర్)కు కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నాయి. గురువారం సాయంత్రం సమయానికి వీబీఆర్‌లో 15.598 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ శివనాయక్ తెలిపారు. వీబీఆర్ నుంచి దిగువకు 7365 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

నంద్యాలలో నకిలీ టీటీడీ సిఫార్సు లెటర్లు

నంద్యాల: టీటీడీ నకిలీ లెటర్లు తయారు చేసి వేల రూపాయలకు అమ్ముకొని సొమ్ము చేసుకున్న వ్యక్తిని నంద్యాల పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నంద్యాల వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన మేరకు.. నంద్యాల బైర్‌మల్ వీధిలో అద్దె ఇంట్లో ఉంటున్న వెంకటేశ్వర్లు అనే యువకుడు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పేరుతో నకిలీ టీటీడీ లెటర్లు తయారు చేశాడు. అంతేకాకుండా ఎంపీ సంతకాన్ని ఫోర్జరీ చేసి విక్రయించాడు. నెల్లూరు జిల్లా కొవ్వూరుకు చెందిన జగదీష్ అనేవ్యక్తి వద్ద రూ.1,500 తీసుకొని ఎంపీ పేరుతో ఫోర్జరీ చేసిన లెటర్‌ప్యాడ్‌ను ఇచ్చి తిరుమల దర్శనానికి పంపారు. తిరుమలలో నకిలీ లెటర్ అని, దర్శనం లేదని చెప్పడంతో మోసం బయట పడింది. పట్టణంలోని తెలుగుపేటకు చెందిన దినేష్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెంచినట్లే పెంచి.. నోటీసులతో తొలగించి!

పింఛన్ల తొలగింపునకు శ్రీకారం

- అనర్హత పేరిట దివ్యాంగులకు నోటీసులు
- పూర్తయిన రీ వెరిఫికేషన్ ప్రక్రియ
- 25 నుంచి 30 శాతం పింఛన్ల కోత
- ఉమ్మడి జిల్లాలో 10వేలకుపైగా పింఛన్లు రద్దయ్యే అవకాశం
- నిరసనలకు సిద్ధమవుతున్న దివ్యాంగులు



కర్నూలు(అగ్రికల్చర్): అనర్హత పేరుతో దివ్యాంగుల పింఛన్ల తొలగింపునకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా గురువారం నుంచి గ్రామ సచివాలయాల ద్వారా నోటీసుల జారీ మొదలైంది. ఈ నెల 27 నాటికి తొలగింపుల ప్రక్రియ పూర్తి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నట్లు సమాచారం. తొలగింపుల తర్వాతనే సెప్టెంబర్ నెల పింఛన్ల పంపిణీకి సంబంధించిన డేటా విడుదలయ్యే అవకాశం ఉంది. ఎన్నికలకు ముందు దివ్యాంగుల పింఛను మొత్తాన్ని రూ.3వేల నుంచి రూ.6వేలకు పెంచుతామని కూటమి నేతలు ఆశలు కల్పించారు. ఎన్నికలయ్యాక ఆ మొత్తం పెంచినా.. ఇప్పుడు ఏకంగా వేలల్లో పింఛన్లను తొలగించేస్తుండటం లబ్ధిదారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికే ప్రతినెలా కొన్ని పింఛన్లు తొలగిస్తూ వచ్చిన ప్రభుత్వం.. తాజాగా రీ వెరిఫికేషన్ ముసుగులో వేలాది పింఛన్లకు ఎసరుపెట్టింది. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన మరుక్షణమే అనర్హత పేరిట దివ్యాంగుల పింఛన్ల తొలగింపునకు పునాది పడింది. ప్రభుత్వం ఏర్పాటై 15 నెలలవుతున్నా కొత్త పింఛన్ల ఊసే కరువైంది. ఇదే సమయంలో అనర్హత పేరిట వేలాది మంది దివ్యాంగుల నోటిలో మట్టికొట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నేపథ్యంలో దివ్యాంగులు పెద్ద ఎత్తున రోడ్డెక్కి నిరసనలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

10వేలకు పైగా పింఛన్లు గల్లంతు

ఉమ్మడి జిల్లాలో రీవెరిఫికేషన్‌కు హాజరైన వారందరికీ సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్‌లు సదరం సర్టిఫికెట్‌తో పాటు నోటీసులను అందజేస్తున్నారు. 55,861 మంది దివ్యాంగుల పింఛను పొందుతుండగా.. వీరందరికీ రీ వెరిఫికేషన్ ప్రక్రియ ఫిబ్రవరిలో మొదలై ఇప్పటి వరకు కొనసాగింది. అయితే 48,032 మంది దివ్యాంగులు రీవెరిఫికేషన్‌కు హాజరయ్యారు. వీరిలో 25 నుంచి 30 శాతం మందికి వికలత్వం 40 శాతంలోపు చూపి పింఛను తొలగింపునకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో 10వేలకు పైగా దివ్యాంగుల పింఛన్లు గల్లంతు కానున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది.

నోటీసుల్లోని వివరాలు ఇలా..

- ➤ దివ్యాంగుల పింఛను రూ.6వేలు పొందాలంటే వికలత్వం కనీసం 40 శాతం ఉండాలి. రీ వెరిఫికేషన్‌లో 40 శాతంలోపు ఉంటే పింఛను రద్దవుతుంది. ఒకవేళ వికలత్వం 40 శాతంలోపు ఉండి.. వయస్సు 60 ఏళ్ల పైబడి ఉంటే వృద్ధాప్య పింఛను వర్తిస్తుంది. ఈ మేరకు దివ్యాంగుల పింఛను కింద నెలకు రూ.6వేలు ఇస్తుండగా.. వృద్ధాప్య పింఛనుగా మార్పు చేస్తూ రూ.4వేలు మాత్రమే అందివ్వనున్నారు.
- ➤ బెడ్‌కు లేదా వీల్ చైర్‌కు పరిమితమై 85 శాతం, ఆపైన వికలత్వం ఉంటే నెలకు ఇస్తున్న పింఛను మొత్తం రూ.15వేలు యథావిధిగా ఉంటుంది. ప్రస్తుతం రూ.6వేల పింఛను తీసుకుంటున్న వారిలో బెడ్‌కు, వీల్ చైర్‌కు పరిమితమై 85 శాతంపైగా వికలత్వం ఉన్నట్లు సదరం సర్టిఫికెట్ ఉంటే పింఛన్ రూ.15వేలుగా మారుతుంది.
- ➤ ప్రస్తుతం రూ.15వేల పింఛను తీసుకుంటున్న వారిలో రీవెరిఫికేషన్‌లో వికలత్వ శాతం 40 నుంచి 85 శాతం వరకు వస్తే ఆ పింఛను రూ.6వేలకు మారుతుంది.



శిరివెళ్ల మండలంలో పంచాయతీ కార్యదర్శి నుంచి అందుకున్న నోటీసును చూపుతున్న పింఛన్ లబ్ధిదారుడు

కూటమి ప్రభుత్వం మోసం చేసింది



దివ్యాంగులను కూటమి ప్రభుత్వం మోసం చేసింది. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని తుంగలో తొక్కింది. వెరిఫికేషన్ పేరిట వికలత్వం శాతం తగ్గించింది. పింఛన్ల రద్దుకు కుట్ర పన్నింది. వంద నుంచి 80 శాతం వికలత్వం సర్టిఫికెట్ ఉన్న వారికి నెలకు రూ.15 వేల పింఛన్ ఇస్తున్నారు. ఇప్పుడు వికలత్వం 60 నుంచి 70 శాతానికి కుదించి రూ. 6 వేల పింఛన్ ఇవ్వడానికి కుట్ర చేశారు. గతంలో డాక్టర్లు శాశ్వత సర్టిఫికెట్లు జారీ చేశారు. అప్పుడు ఇచ్చిన డాక్టర్, ఇప్పుడు ఇచిన డాక్టర్ ఇచ్చిన సర్టిఫికెట్‌కు తేడా ఏమిటో ప్రభుత్వమే చెప్పాలి. దివ్యాంగులకు న్యాయం చేయాలి. లేదంటే ఉద్యమం చేస్తాం.

– మరియదాసు, దివ్యాంగుల ఆదరణ సేవా సమితి అధ్యక్షుడు

■ మువ్వన్నెల సంబరం!



గుండె నిండా దేశభక్తి

కర్నూలు కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జాతీయ జెండాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

జెండా పండుగకు సర్వం సిద్ధం



ముస్తాబైన నంద్యాల డిగ్రీ కాలేజీ మైదానం

నంద్యాల: స్వాతంత్య్ర వేడుకలకు నంద్యాలలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం ముస్తాబైంది. జెండా పండుగను తిలకించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. వీఐపీల కోసం గ్యాలరీలను తీర్చిదిద్దారు. విద్యార్థులు, మహిళలు, ప్రజలు కూర్చునే విధంగా ఏర్పాట్లు చేశారు. తాగునీరు అందుబాటులో ఉంచడంతోపాటు మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు, స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భారీగా హాజరు కానున్నారు. డీఆర్‌డీఏ, డ్వామా, వ్యవసాయం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, గ్రామీణ నీటి సరఫరా తదితర శాఖలకు సంబంధించి శకటాలను ప్రదర్శనలకు సిద్ధం చేశారు. స్వాతంత్య్ర వేడుకల నేపథ్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు.

చెరువు గండికి టీడీపీ నాయకులే కారణం

- వేగవంతంగా పనులు చేపట్టాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి



మద్దిగుండం చెరువుకు పడిన గండిని పరిశీలిస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: మద్దిగుండం చెరువుకు గండి పడటానికి టీడీపీ నాయకులే కారణమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి అన్నారు. మిడుతూరు మండల పరిధిలోని మద్దిగుండం చెరువుకు పడిన గండిని గురువారం బైరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువు కట్టపై చెట్లను తొలగించడంతో ఇటీవల కురిసిన వర్షాలకు గండి పడిందన్నారు. ఇంత వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలాంటి చర్యలు ఎందుకు చేపట్టలేదని మండిపడ్డారు. సొంత జేసీబీలతో ఇష్టానుసారంగా పనులు చేయడంతో గండిపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద పెద్ద చెట్లను తొలగించే సమయంలో అధికారుల పర్యవేక్షణ కొరవడిందని ఆరోపించారు. చెట్లు తొలగించడంతోనే చిన్న రంధ్రం పడి పెద్దగా గండి పడి చెరువులో నీరంతా పంట పొలాల్లోకి వెళ్లి పంట నష్టం జరిగిందన్నారు. చెరువు పని చేసిన వారిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో రైతాంగానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చిన్న తప్పులు చేస్తేనే కేసులు పెడుతున్నారని, చెరువు పనులు ఎలా పడితే అలా చేసిన కాంట్రాక్టర్లపై ఇరిగేషన్ అధికారులు ఏమైనా కేసులు పెట్టారా అని ఆయన ప్రశ్నించారు. త్వరితగతిన అధికారులు చెరువుకు మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. అవసరం లేని పనులు చేసి నాయకులు జేబులు నింపుకుంటున్నారే తప్ప నాణ్యతగా చేయలేదన్నారు. గండిపడి మూడు రోజుల అయినా ప్రజాప్రతినిధులు, అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. వెంటనే మరమ్మతులు చేపట్టకపోతే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. జెడ్పీటీసీ సభ్యుడు యుగంధర్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు లోకేష్‌రెడ్డి, శివరామకృష్ణారెడ్డి, శివనాగిరెడ్డి, మల్లేశ్వరరెడ్డి, గుండం హరిస్వరోత్తమ రెడ్డి, రవికుమార్, స్వామిరెడ్డి, సాంబశివుడు, పుల్లయ్య, లింగారెడ్డి, రాముడు, రాము పాల్గొన్నారు.

నీటి సంరక్షణ పనులు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: జిల్లాలో నీటి సంరక్షణ పనులు విస్తృతంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులకు సూచించారు. గురువారం విజయవాడ సచివాలయం నుంచి సీఎం చంద్రబాబు నాయుడు భూగర్భజలాల సంరక్షణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నంద్యాల కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జేసీ విష్ణు చరణ్, నీటి వినియోగదారుల సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు, నీటిపారుదల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి భూగర్భ జలాలు పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ఇక నుంచి ప్రతి గ్రామంలో కురిసిన వర్షపు నీరు అక్కడే ఇంకిపోయేలా నీటి సంరక్షణ పనులు చేపట్టాలన్నారు. నీటి సంఘాల సభ్యులు నీటి ప్రాధాన్యతను తెలుసుకోవాలన్నారు.

ముగిసిన సప్తరాత్రోత్సవాలు





వేడుకలు తిలకిస్తున్న భక్తులు, ఉత్సవమూర్తికి హారతులు పడుతున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: సద్గురు రాఘవేంద్రస్వామి 354వ ఆరాధన సప్తరాత్రోత్సవాలు గురువారంతో ముగిశాయి. వేడుకల్లో భాగంగా శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నేతృత్వంలో చివరిరోజు సంబరాలు కనుల పండువగా జరిగాయి. ఉదయం మండలంలోని అను మంత్రాలయం (తుంగభద్ర)లోని మఠంలో రాఘవేంద్రస్వామి రథోత్సవం చేపట్టారు. ముందుగా ఉత్సమూర్తి ప్రహ్లాదరాయలకు చామర్ల సేవతో హారతులు పట్టారు. అనంతరం రథంపై కొలువుంచి గ్రామ పుర వీధుల్లో వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి ఆరాధన ఉత్సవాల విశిష్టతను భక్తులకు వివరించారు. రాత్రి శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో ఉత్సవమూర్తికి పంచ వాహనాలతో రథయాత్ర చేపట్టారు. ఈ వేడుకలు ఏడు రోజుల పాటు భక్తులను ఆధ్యాత్మిక చింతనలో ముంచెత్తాయి.

ఊరించి.. ఉసూరుమనిపించి!

- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో ఎన్నో నిబంధనలు
- 16 రకాల బస్సుల్లో ఉమ్మడి జిల్లాలో కేవలం మూడింటికే పరిమితం
- కాలం తీరిన బస్సులతో కష్టమే అంటున్న ఉద్యోగులు
- నేటి నుంచి అమలు కానున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

' మీ ఇష్టం..మీరు ఎక్కడకు కావాలంటే అక్కడికి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. బస్సులో ఎవరైనా టికెట్ అడిగితే మా చంద్రన్న చెప్పాడని చెప్పండి.. మహిళలు రాష్ట్రంలోని ఏ పుణ్యక్షేత్రాలకైనా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో వెళ్లి సందర్శించి రావొచ్చు.'

– ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఇచ్చిన హామీ ఇది.

అధికారంలోకి వచ్చి ఏడాదైనా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై సీఎం చంద్రబాబు పట్టించుకోలేదు. ఇచ్చిన హామీని మరచిపోయారు. సమావేశాల్లో మహిళలు నిలదీస్తారేమోననే భయంతో తూతూ మంత్రంగా మహిళలకు ఉచిత బస్సును అమలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉచితం అని చెప్పి.. చివరికి కొన్ని బస్సులకే పరిమితం చేశారు.

కర్నూలు సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమని ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన నేతలు ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చాక హామీని అమలు చేయకుండా మంత్రుల కమిటీతో కాలయాపన చేశారు. ఏడాది తరువాత ఇచ్చిన హామీ అమలు కోసం జీఓ విడుదల చేశారు. దీని ప్రకారం ఉచిత ప్రయాణాన్ని పేరుకే తప్ప పెద్దగా ప్రయోజనం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆర్టీసీలో సుమారుగా 16 రకాల సర్వీసులు ఉండగా..కేవలం ఐదు రకాల సర్వీసుల్లో మాత్రమే ఉచిత ప్రయాణాన్ని పరిమితం చేశారు. ఇందులో మెట్రో ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ వంటి సర్వీసులు తిరుపతి, విజయవాడ, విశాఖలలో మాత్రమే ఉన్నాయి. మార్గదర్శకాల ప్రకారం ఉమ్మడి జిల్లాలో కేవలం పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌ల్లో మాత్రమే అమలు కానుంది. ఇందులో కూడా అత్యధిక శాతం బస్సులు అద్దె బస్సులు ఉన్నాయి. నాన్‌స్టాప్ సర్వీసులు, ఏ క్యాటగిరీకి చెందిన అంతర్రాష్ట్ర సర్వీసులు(ఉమ్మడి జిల్లాలోని డిపోలకు చెందిన బస్సులు), కాంట్రాక్ట్ క్యారేజ్ సర్వీసులు, చార్టర్డ్, ప్యాకేజీ టూర్ల సర్వీసులకు, సప్తగిరి ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్, అన్ని ఏసీ బస్సులలో ఉచిత బస్ అమలు వర్తించదు. అమలు చేయనున్న బస్సుల్లో ప్రయాణం రాష్ట్రం మొత్తం తిరగొచ్చు అని చెబుతున్నా, వాస్తవం అందుకు విరుద్ధంగా ఉంది. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో కేవలం గ్రామీణ ప్రాంతాలకు వెళ్లవచ్చు. విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడకు ఎక్స్‌ప్రెస్ బస్సులు లేవు. తిరుపతి, అనంతపురం, కడపకు వెళ్లేందుకు కొన్ని మాత్రమే ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయి.

బస్సులు, సిబ్బంది కొరత

ఉమ్మడి జిల్లాలో 12 బస్ డిపోలు, 962 బస్సులు ఉన్నాయి. వీటిలో 215 అద్దె బస్సులు, 7 లక్షల కి.మీ పైగా తిరిగిన బస్సులు 60 శాతం ఉన్నట్లు ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. ఉచిత పథకం అమలు చేయాలంటే కొత్తగా ఉమ్మడి జిల్లాలోని 12 డిపోలకు సుమారుగా వందకిపైగా కొత్త బస్సులు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఆర్టీసీలో 2013 నుంచి కొత్త ఉద్యోగాల నియామకాలు నిలిచిపోయాయి. కారుణ్యనియామకాల కింద గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేసింది. అయితే ప్రస్తుతం 3,450 మంది మాత్రమే పని చేస్తున్నారు. వీరిలో 30 శాతం మంది అవుట్ సోర్సింగ్, డైలీవైజ్ కింద సిబ్బంది పని చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 1,057 గ్రామాలు ఉండగా 30 శాతం గ్రామాలకు ఎలాంటి బస్సు సర్వీసులు లేవు.



ఇదీ మోసం..

నమ్మిచ్చి మోసం చేయడంలో తనకు సాటి లేరని టీడీపీ అధినేత చంద్రబాబు మరోసారి నిరూపించుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా మహిళలకు ఆడబిడ్డ నిధి, మూడు గ్యాస్ సిలిండర్ల వంటి పథకాలను అమలు చేయలేదు. మహిళల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత రావడంతో దాన్ని ఎంతో కొంత తగ్గించాలనే మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలుకు శ్రీకారం చుట్టారు. ఓట్ల సమయంలో మాటలతో మాయ చేసి ఇచ్చిన హామీలను అరకొరగా చేస్తుండడంతో మహిళల్లో కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తోంది.

ఉచిత బస్సు ప్రారంభం నేడు.. అమలు రేపటి నుంచి

ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు నేడు(శుక్రవారం) సీఎం చంద్రబాబు నాయుడు విజయవాడలో ఉచితబస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తారు. ఆ తరువాత సాయంత్రం నంద్యాల, కర్నూలు జిల్లాల్లో ఆయా జిల్లాలకు చెందిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేల చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. అయితే పథకం అమలు మాత్రం శనివారం నుంచి పూర్తి స్థాయిలో అమలు చేయనున్నట్లు ఆర్టీసీ అధికార వర్గాలు వెల్లడించాయి.

ఆటో కార్మికుల ఉపాధికి ఏం చేశారు?

ఉచిత బస్సు పథకం అమలు చేయనున్న బస్సులు అత్యధిక శాతం గ్రామీణ ప్రాంతాల్లోకి వెళ్లేవి ఉన్నాయి. గ్రామాల్లో ఆటోలు తిప్పుకుంటున్న కార్మికుల ఉపాధికి ముప్పు పొంచి ఉండే ప్రమాదం ఉంది. ఇదే విషయంపై ఎన్నికల సమయంలో బాబు ఆటో కార్మికుల ఉపాధికి ఇబ్బందులు రాకుండా వారి కోసం ప్రత్యేక సంక్షేమాన్ని అమలు చేస్తామని చెప్పారు. కానీ ఇప్పటి వరకు ఆ వైపుగా ఎలాంటి చర్యలు ప్రభుత్వం తీసుకోలేదు.

క్లుప్తంగా

జిల్లాలో 2,871 టన్నుల యూరియా

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో యూరియా 2871.78 టన్నులు అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. మార్క్‌ఫెడ్ దగ్గర 1549.995 టన్నులు, రైతుసేవా కేంద్రాల్లో 251.48 టన్నులు, ప్రయివేటు డీలర్ల దగ్గర 910.42 టన్నులు, హోల్‌సేల్ డీలర్ల దగ్గర 120.26 టన్నులు, సహకార సంఘాలు, పీఏసీఎస్‌ల్లో 39.06 టన్నుల ప్రకారం యూరియా ఉందని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న 1–2 రోజుల్లో 600 టన్నుల యూరియా జిల్లాకు రానుందని, ఆగస్టు నెల సప్లయ్ ప్లాన్ ప్రకారం 9,575 టన్నుల యూరియా జిల్లాకు రావాల్సి ఉందని, ఇప్పటి వరకు 4,308 టన్నుల యూరియా సరఫరా అయిందని, మిగిలిన యూరియా కూడా జిల్లాకు వస్తుందన్నారు.

పట్టపగలే చోరీ

ఆలూరు రూరల్: ఆలూరులో పట్టపగలే చోరీ జరిగింది. గ్రామ పంచాయతీలో కార్మికుడిగా పని చేస్తున్న నరసప్ప స్థానిక ఇంద్రా నగర్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం ఉదయం అందరూ పనికెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని విషయం తెలుసుకున్న గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడ్డారు. బీరువా తాళాలు పగులకొట్టి అందులో ఉన్న రూ.30 వేల నగదు, 15 వేలు విలువ చేసే బంగారు చెవి కమ్మలు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భర్త సినిమాకు వెళ్తున్నాడని..

రుద్రవరం: పనులు మానుకుని సినిమాకు వెళ్లొద్దని చెప్పినా భర్త మాట వినకపోవడంతో మనస్తాపం చెందిన భార్య ఆత్మహత్యకు పాల్పడింది. ఏఎస్‌ఐ బాలన్న తెలిపిన వివరాల మేరకు.. చందలూరుకు చెందిన ప్రసన్న (28), ఆమె భర్త ఆంజనేయులు వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. వీరికి ఇద్దరు సంతానం. కాగా అప్పుడప్పుడు ఆమె భర్త కూలీ పనులు ఎగ్గొట్టి కొత్తగా రిలీజ్ అయిన సినిమాలకు వెళ్లేవాడు. ఇందులో భాగంగా గురువారం ఆళ్లగడ్డ పట్టణంలో కొత్తగా రిలీజ్ అయిన సినిమాకు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. సినిమాకొద్దు అంటూ భార్య అడ్డు పడింది. దీంతో వారి మధ్య వాగ్వాదం నెలకొంది. భర్త తనమాట వినక పోవడంతో మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఉరేసుకుంది. మృతురాలి తల్లి సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

- ఛాతీపై విజయ్ పేరుతో పచ్చబొట్టు



డోన్ టౌన్: గుంటూరు – డోన్ రైలులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. దాదాపు 45 ఏళ్ల వయస్సు ఉండే వ్యక్తి బుధవారం రాత్రి 11.45 గంటలకు గుంటూరు నుంచి డోన్‌కు చేరుకున్న రైలు బోగిలో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. పక్కనే ఉన్న ప్రయాణికులు గమనించి రైల్వే అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ నారాయణకు సమాచారం ఇచ్చారు. రైల్వే ఆసుపత్రి డ్యూటీ డాక్టరు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుని ఎడమవైపు ఛాతిపై విజయ్ అను పచ్చబోట్టు, శరీరంపై గోధుమ, నలుగు రంగు గళ్ల చొక్కా, లేత బ్లూ రంగు ప్యాంట్ ఉన్నట్లు రైల్వే ఎస్‌ఐ బిందుమాధవి గురువారం తెలిపారు. మృతుని వివరాలు తెలిస్తే 90304 81295, 99637 04485 సమచారం ఇవ్వాలని కోరారు.



రావి ఆకులో భారతదేశ చిత్రం

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదోని పట్టణం కార్వన్‌పేటకు చెందిన విద్యార్థి జి. భరత్ కుమార్ రావి ఆకుపై భారతదేశ చిత్ర పటంతో పాటు త్రివర్ణ పతాకాన్ని రూపొందించాడు. ఈ సందర్భంగా నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫయాజుద్దీన్ మాట్లాడుతూ తమ పాఠశాల 8వ తరగతి విద్యార్థి గొప్ప చిత్రాన్ని రూపొందించడం అభినందనీయమన్నారు.

– ఆదోని సెంట్రల్



జాతీయ పతకాలు, అలంకరణ సామగ్రి కొనుగోలు చేస్తున్న దృశ్యం



దుకాణం వద్ద త్రివర్ణ రంగుల వస్తువుల అమ్మకాలు

దేశభక్తి ప్రతిబింబించేలా..

జెండా పండుగకు పిల్లలూ.. పెద్దలూ ఉత్సాహంగా.. ఉల్లాసంగా సన్నద్ధమవుతున్నారు. స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దేశభక్తి, జాతీయ భావం ఉట్టిపడేలా ఏర్పాట్లలో అందరూ నిమగ్నమ య్యారు. ఓ వైపు జెండా ప్రదర్శనలు, మరో వైపు మూడు రంగుల జెండాలు, ఆకట్టుకునే అలంకరణ సామగ్రి తదితర వస్తువుల అమ్మకాలతో కర్నూలు నగరంలో సందడి నెలకొంది.

– సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు



కలెక్టరేట్ వద్ద మాంటిస్సోరి విద్యార్థుల ప్రదర్శన





150 సూక్ష్మ చిత్రాలు

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నంద్యాల పట్టణ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ కోడిగుడ్డుపై 150 మంది స్వాతంత్య్ర సమరయోధుల పొట్రాయిట్ సూక్ష్మ చిత్రాలను గీశారు. వాటర్ కలర్ మైక్రో బ్రష్‌తో మూడు గంటలు శ్రమించి చిత్రాలు వేశారు. అందులో స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన వీరులు, సమర యోధులను చూపించారు.

– నంద్యాల(అర్బన్)

చోరీకి పాల్పడిన కేర్ టేకర్ అరెస్ట్

- రూ. 6.90 లక్షల విలువ చేసే ఆభరణాలు స్వాధీనం



రికవరీ చేసిన బంగారు ఆభరణాలను ప్రదర్శిస్తున్న సీఐ శ్రీనివాసులు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని గాంధీనగర్‌లో ఓ వ్యక్తి ఇంట్లో కేర్ టేకర్‌గా ఉంటూ చోరీకి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. దాదాపు రూ. 6.90 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. గురువారం పట్టణ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీనివాసులు కేసు వివరాలను వెల్లడించారు. గాంధీనగర్‌కు చెందిన కుమారస్వామి అనే వ్యక్తి తండ్రి ధనుంజయుడు రిటైర్డ్ ఉద్యోగి. కుమారస్వామి ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ తండ్రికి కొంత దూరంగా నివాసముంటున్నాడు. తండ్రి బాగోగులు చూసుకోవటానికి హైదరాబాద్‌లోని ఓ సంస్థ నుంచి అనంతపురం టౌన్‌కు చెందిన నిమ్మగంటి చరణ్‌సాయి అనే వ్యక్తిని ఈ ఏడాది జూన్ నెలలో కేర్ టేకర్‌గా నియమించుకున్నాడు. అయితే ఇంట్లో నగలు భద్ర పరిచిన చోటును పసిగట్టిన చరణ్‌సాయి పనిలో చేరిన 15 రోజుల్లోనే ఇంటికి కన్నం వేశాడు. అల్మారా తాళం పగలగొట్టి అందులో ఉన్న నాలుగు బంగారు గాజులు, రెండు పొరల బంగారు చైన్, రెండు ఉంగరాలు, జత కమ్మలతో పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ ఎంఎన్ భార్గవి ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐలు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసులు, హెచ్‌సీ మద్దిలేటి, క్రైం పార్టీ పోలీసులు ఉసేని, రఘునాథ్, సుధాకర్, గోపాల్ బృందాలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడి చరణ్ సాయిని అనంతపురం టౌన్ తన ఇంటి సమీపంలోని అన్న క్యాంటీన్ దగ్గర ఉండగా అరెస్ట్ చేశారు. కాగా దొంగలించిన బంగారు ఆభరణాలను ఒక గోల్డ్ ఫైనాన్స్‌లో తనఖా పెట్టి లోన్ తీసుకున్నాడు. దీంతో ఆ సంస్థకు నోటీసు జారీ చేసి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను బాధితులకు అప్పగించినట్లు తెలిపారు. కేసును త్వరగా ఛేదించినందుకు జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ టౌన్ సీఐ, ఎస్‌ఐలు, సిబ్బందిని అభినందించారు. ప్రజలు తమ ఇళ్లలో కొత్తవారిని పనిలో తీసుకోవాల్సి వస్తే పూర్తిగా విచారించాలన్నారు. ప్రజలు బంగారు ఆభరణాలను బ్యాంక్ లాకర్‌లో భద్రపరుచుకోవాలన్నారు. సమావేశంలో టౌన్ ఎస్‌ఐ–2 శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

నాల్గోసారి ఉత్తమ స్కూల్‌గా..



కర్నూలు సిటీ: నగరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్ రాష్ట్రస్థాయిలో ఉత్తమ స్కూల్‌కు ఎంపికైంది. విజయవాడలో శుక్రవారం సీఎం నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డును ప్రధానోపాధ్యాయుడు కె.శివప్రసాద్ అందుకోనున్నారు. ఈ పాఠశాల 2018లో అడ్వాన్స్ ఫౌండేషన్ స్కూల్‌గా ఎంపికైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో (2020లో) భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పేరుతో స్కూల్ ఏర్పాటుకు కర్నూలు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు. ఈ తీర్మానం మేరకు 6 నుంచి 10వ తరగతి వరకు తరగతికి 60 సీట్ల చొప్పున అనుమతులు ఇస్తూ 2021 మార్చి 10న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్ జీఓ ఎం.ఎస్ నంబరు 20ని జారీ చేశారు. ప్రవేశ పరీక్ష ద్వారా సీట్లు భర్తీ చేస్తున్నారు. తొలుత 2021–22లో , తర్వాత 2022–23లో, 2023–24లో పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణులు అయ్యారు. 2024–25 విద్యా సంవత్సరంలో 43 మంది పరీక్షలు రాస్తే 43 మంది పాసయ్యారు. ఈ స్కూల్‌కి చెందిన టి.సాయి లఖిత 595 మార్కులు సాధించింది. దీంతో వరుసగా నాల్గోసారి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ స్కూల్‌గా ఎంపికైంది.

స్కూటీని ఢీకొన్న కారు

- దంపతులు, బాలుడికి తీవ్ర గాయాలు

ఎమ్మిగనూరురూరల్: ఆదోని – కర్నూలు రహదారిలో బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడితో పాటు దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. గోనెగండ్ల మండలం హెచ్.కైరవాడికి చెందిన గంగన్న, భార్య భాగ్యలక్ష్మీ కుమారుడు ఉపేంద్రలు ఉదయం స్కూటీపై దేవబెట్ట గ్రామానికి కొత్త బట్టలు పెట్టుకునేందుకు బంధువుల ఇంటికి వెళ్లారు. బట్టలు పెట్టుకొని సాయంత్రం తిరిగి స్వగ్రామానికి స్కూటీపై వస్తున్నారు. కర్నూలుకు చెందిన దినేష్‌రెడ్డికి కొత్తగా పెళ్లి అయ్యింది. భార్య ఆదోనిలో ఉపాధ్యాయురాలు పని చేస్తోంది. ఆ స్కూల్‌లో సెలవు పెట్టి తిరిగి కర్నూలుకు బయలు దేరారు. బనవాసి నవోదయ దగ్గర ముందు వెళ్తున్న స్కూటీని వెనక నుంచి అతి వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో బైక్‌పై ఉన్న గంగన్న, భాగ్యలక్ష్మీ, బాలుడు ఉపేంద్రలు ఎగిరి పక్కనే కాలువలో పడిపోయారు. ప్రమాదానికి గురైన కారు రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీ కొట్టి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తు విద్యుత్ స్తంబం విరిగి కింద పడకపోవటంతో అందరూ ప్రాణాలతో బయటపడ్డారు. అయితే ప్రమాదంలో దంపతులతో పాటు కుమారుడికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స కోసం 108లో ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

‘నాకు ప్రాణహాని ఉంది’

- వరసిద్ధి వినాయక స్వామి ఆలయ నిర్వాహకుడి సెల్ఫీ వీడియో వైరల్



బనగానపల్లె: తనకు ప్రాణహాని ఉందని పాతపాడు – యాగంటి క్షేత్ర రహదారిలో ఉన్న వరసిద్ధి వినాయక ఆలయం నిర్వాహకుడు వలిస్వామికి చెందిన సెల్ఫీ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. వలిస్వామి గత 25 ఏళ్లగా దాతల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేశారు. అయితే గత రెండు నెలలుగా కొందరు ఈ ఆలయాన్ని స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతో బెదిరిస్తున్నారని వీడియోలో ఆరోపించారు. ప్రస్తుతం ఆలయం ఉన్న స్థలం విలువ రూ. కోట్లు చేస్తుందని, ఎలాగైనా ఆలయాన్ని ఆక్రమించుకోవాలని కొందరు కుట్ర పన్నుతున్నట్లు ఆయన వాపోయారు. ఈ విషయాన్ని తాను కొందరి పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



విశ్వనాథ్ గౌడ్ (ఫైల్)

కర్నూలు: నగరంలోని కృష్ణానగర్‌లో నివాసముంటున్న ఇ.విశ్వనాథ్ గౌడ్ (35) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. బండి అత్మకూరు మండలం ఈర్నపాడు గ్రామానికి చెందిన విశ్వనాథ్ గౌడ్ ఉపాధి నిమిత్తం కొన్నేళ్ల క్రితం కర్నూలుకు చేరుకున్నాడు. ఓ ప్రైవేటు సంస్థలో డీటీపీ ఆపరేటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ నెల 11వ తేదీన దుకాణానికి వెళ్తున్నట్లు చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. 12వ తేదీ తన భర్త కనిపించడం లేదని భార్య నాగమణి నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా గురువారం ఉదయం కోడుమూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని రామాపురం గ్రామం వద్ద హంద్రీనీవా కాలువలో శవమై తేలాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమివ్వడంతో కోడుమూరు పోలీసులు అక్కడికి చేరుకుని నీళ్లలో తేలియాడుతున్న మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి జేబులో ఉన్న పర్సులో ఆధార్ కార్డు లభించంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అప్పటికే నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదై ఉండటంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈయనకు కొడుకు, కూతురు సంతానం. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు నాల్గవ పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టగా సఫా ఇంజినీరింగ్ కళాశాల వద్ద హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వ గట్టుపై విశ్వనాథ్ గౌడ్ ద్విచక్ర వాహనం లభించింది. దీంతో ప్రమాదవశాత్తు నీటిలో పడి చనిపోయాడా.. లేక ఎవరైనా హత్య చేసి పడేశారా.. అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

వెల్దుర్తి: పట్టణంలోని ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పవన్‌కిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడుల్లో భాగంగా ముందుగా విజిలెన్స్ సిబ్బంది రైతుల రూపంలో అన్ని దుకాణాలకు వెళ్లి ధరలను విచారించారు. ఇందులో నాలుగు దుకాణాల్లో అధిక ధరలకు అమ్ముతున్నట్లు తెలుసుకున్నారు. ఆయా దుకాణాలపై వెంటనే విజిలెన్స్ సీఐ, ఆ శాఖ ఏఓ విశ్వనాథ్, స్థానిక ఏఓ అక్బర్ బాషా దాడులు చేసి ముందుగా లైసెన్స్, రికార్డులు, స్టాకు పరిశీలించారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువగా అమ్ముతున్నారని గుర్తించి నాలుగు దుకాణాలలోని 390 బస్తాల రూ.3,74,407ల విలువైన ఎరువుల అమ్మకాల నిలిపివేస్తూ, నిత్యావసరాల చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఏఓ తెలిపారు.

ఉప్పలపాడులో యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన సునీల్‌కుమార్

ఓర్వకల్లు: ఉప్పలపాడు గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గ్రామానికి చెందిన శ్రీనివాసులు భార్య చనిపోవడంతో రెండో వివాహం చేసుకున్నాడు. కాగా మొదటి భార్య కూతురు నందిని బేతంచెర్ల నుంచి వచ్చి ఉప్పలపాడులో నివాసముంటున్న తలారి సునీల్‌కుమార్ (21)తో ఏడాది క్రితం ప్రేమించి పెళ్లిచేసుకోంది. సునీల్ కొంతకాలంగా జులాయిగా తిరుగుతున్నాడు. ఈ క్రమంలో అతని భార్య నందిని కాన్పు కోసం పుట్టింటికి వెళ్లింది. అయితే మూడు రోజుల క్రితం సునీల్ భార్య వద్దకు వెళ్లగా మామ, అల్లుడి మధ్య ఘర్షణ జరిగి శ్రీనివాసులు అల్లుడిపై దాడికి పాల్పడినట్లు తెలిసింది. దీంతో మనస్తాపం చెందిన సునీల్ గురువారం తన సొంతింటిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లి మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సునీల్ కుమార్ తెలిపారు.

పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల తగ్గింపు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి నీటి విడుదలను 32 వేల నుంచి 22 వేల క్యూసెక్కులకు తగ్గించినట్లు ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఐదు రోజుల నుంచి నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలతో దిగువ ప్రాంతాల్లోని కాల్వలు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ముందు జాగ్రత్త చర్యగా నీటి విడుదలను తగ్గించామన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ గేట్లను కిందికి దించి 22 వేల క్యూసెక్కుల నీటిని ఎస్సారెమ్సీ కాల్వలోకి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ నీటిని తెలుగుగంగ క్యాకు 8వేల క్యూసెక్కులు, ఎస్సార్బీసీ నుంచి జీఎన్ఎస్ఎస్‌కి 9వేలు, కేసీ ఎస్కేప్ కాల్వకు 5వేల క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు బానకచర్ల ఏఈ దేవేంద్ర తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ మెరిట్ విద్యార్థినులకు కెనరా విద్యా జ్యోతి



విద్యార్థినికి పాస్‌బుక్ అందిస్తున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కే తులసీదేవి

కర్నూలు(అర్బన్): కెనరా విద్యా జ్యోతి పథకం పేరుతో ప్రతి ఏడాది 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ మెరిట్ విద్యార్థినులను ఎంపిక చేసి ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు కెనరా బ్యాంకు కర్నూలు రీజినల్ మేనేజర్ సుశాంత్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీ బ్రాంచ్‌లో విద్యాజ్యోతి పథకం కింద ఎంపికైన విద్యార్థినులకు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని కెనరా బ్యాంకు శాఖల ద్వారా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాలికల విద్యాభివృద్ధి దేశ ప్రాధాన్యత అయితే ఈ లక్ష్యాన్ని సాధించేందుకు కెనరా బ్యాంకు కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కే తులసీదేవి మాట్లాడుతూ.. కెనరా విద్యాజ్యోతి పథకం ద్వారా విద్యార్థినులను విద్యాపరంగా మరింత ప్రోత్సహించడంతో పాటు అమ్మాయిల భవిష్యత్తు నిర్మాణానికి తోడ్పడుతుందన్నారు. గతంలో పేద ప్రతిభావంతురాలైన ఎస్సీ విద్యార్థినికి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఒక లాప్‌టాప్‌ను కూడా కెనరా బ్యాంకు అందించిందన్నారు. కార్యక్రమంలో డివిజినల్ మేనేజర్ సురేష్‌కుమార్, బ్రాంచ్ మేనేజర్ శంకర్, చైతన్య శివరాజ్ పాల్గొన్నారు.